# 30. బ్రహ్మ రహస్యం

పంజాబ్‌లోని జింద్ సంస్థానాధీశులైన కల్నల్ హిజ్‌హైనెస్, పర్జాంద్ ఇ దిల్‌బాంద్, రసిఖుల్ ఇతికడ్, దౌలత్ ఇ ఇంగ్లీషియా, రాజా ఇ రాజన్, మహారాజాసర్, రణవీర్‌సింగ్ రాజేంద్ర బహదూర్ వారికి బ్రహ్మచెవుడు. కానీ, శ్రీవారు బ్రిటీష్‌పాలకుల దృష్టిలో ఆదర్శప్రభువు. అందుకు గుర్తుగా వారు ఎన్నెన్నో బిరుదులతో శ్రీవారిని సన్మానించి ఉన్నారు.

శ్రీవారు అనుదినం మధ్యాన్నం 4 గంటలవేళ నిద్రలేస్తారు.

ఆ లేవటం ఎలా జరుగుతుంది?

శ్రీవారి యూరోపియన్ మహారాణి డోరతీ, మరికొందరు భారతీయ రాణులు సర్వాలంకార శోభితలై మధురగీతా లాలపిస్తూ శ్రీవారి పాదపద్మాలను అతి మధురంగా వొత్తనారంభించగా అప్పుడు శ్రీవారు మెల్లమెల్లగా కళ్ళు తెరుస్తారు.

సరిగ్గా ఆక్షణానికి వెచ్చని టీతో ఓ రాణి శ్రీవారిముందు ప్రత్యక్షమవుతుంది. అలా టీ అందించవలసిన సుందరాంగి ఎవరనేది ఆస్థాన జ్యోతిష్యులు పండిట్ కరంచంద్ నిర్ణయిస్తారు. ఎందుకంటే మహారాజా వారికి పట్టింపులు జాస్తి, రోజూ కళ్ళు తెరవగానే కనుపించే ముఖం మంచి చెడులను బట్టే ఆ రోజంతా తన సుఖభోగాల బాగోగులు ఆధారపరి ఉంటాయని శ్రీవారి ప్రగాఢ విశ్వాసం. కనుక పండిట్ కరంచద్‌జీవారు నెలకోసారి అంతఃపుర స్త్రీలలో ఏరోజు ఎవరు మహారాజావారిని మేల్కొలిపి

టీ అందించాలో నిర్ణయించి జాబితా తయారుజేస్తారు. అందుకుగాను జ్యోతిష్యులవారు బహు మెలకువగా అంతఃపుర స్త్రీలందరి జాతకాలూ పరామర్శిస్తారు.

అక్కడినుండి మహారాజావారు ప్రక్కగదికి వెళ్ళి వేంచేసిఉన్న ప్రధానమంత్రికీ ఇతర మంత్రులకూ దర్శనమిస్తారు. అయితే శ్రీవారికి వారితో రాచకార్యాలు చర్చించే వ్యవధి తక్కువ కనుక కేవలం దర్శనం మాత్రం ఇచ్చి వారి వందనాలు అందుకుంటారు.

ఆ తరువాత శ్రీవారి బ్రేక్‌ఫాస్ట్ మొదలవుతుంది. కొద్దిగ్లాసుల ఫ్రెంచి ఛాంపేన్‌ను మధ్యమధ్య టీ సేవిస్తూ శ్రీవారు ఖాళీచేశాక స్నానం ఆరంభమవుతుంది. స్నానసమయంలో మహారాజావారు బ్రాందీ మాత్రమే సేవిస్తారు

రాత్రి 11 గంటలకల్లా డిన్నర్ మొదలవుతుంది. మహారాజావారు కేవలం రెండు గంటలపాటు మాత్రమే భోజనం కొనసాగిస్తారు. ఆ తరువాత తెల్లవారి 4 గంటలదాకా తనకు ఇష్టులైన రాజోద్యోగులతో, రాచ కుటుంబీకులతో శ్రీవారు పేకాడతారు. ఆ ఆటలో శ్రీవారు రోజూ కొన్ని వేల రూపాయలు మాత్రమే ఓడి పోతుంటారు. ఆట పూర్తయే పుణ్య ఘడియలకు మహారాజావారు కేవలం 25 పెద్ద పెగ్గుల బ్రాందీ మాత్రం ఆస్వాదిస్తారు

అప్పుడు...

మహారాజావారు ఆటనుండి లేచి తన కిష్టురాలైన మహారాణీతో కలసి శయనాగారంలోకి నిష్క్రమిస్తారు. శ్రీవారు మరలా మధ్యాహ్నం 4 గంటలదాకా ఎవరికీ కనిపించిరు చివరికి వైస్రాయ్ వేంచేసినా సరే అందాకా ఆగవలసిందే

★

చిరుతపులులను వేటాడడంలో శ్రీవారు సిద్ధహస్తులు. వాటిని సజీవంగా పట్టుకుతెచ్చి బోనుల్లోపెట్టి వాటిచే పోరాడించి ఆనందించడం శ్రీవారి హాబీ.

ఈ విధంగా మహారాజా సర్ రణవీర్ సింగ్ రాజేంద్ర బహద్దర్ వారు జింద్ సంస్థానాన్ని "ప్రజానురంజకంగా" పాలించి బ్రిటిష్ వారిచే అనేకానేక బిరుదులు పొంది, 75 సంవత్సరాల వయసుదాకా రాచభోగాలనుభవించి తన పాలనకు గోల్డెన్ జూబిలీకూడా మహా ఘనంగా జరుపుకున్నారు.

బ్రిటిష్ వారు అందుకు మెచ్చి భారతదేశానికే "నైట్ గ్రాండ్ కమాంగర్"గా శ్రీవారిని ఎన్నిక చేశారు.

శ్రీవారి ఆఖరి రోజులలో ముఖ్యమంత్రిగా నియమితులయిన ఒకరికి అనుమానం వచ్చింది. శ్రీవారు అసలు రాజ్యాంగ వ్యవహారాలు పట్టించుకునే తీరికా, కనీసం ఫైళ్ళమీద సంతకాలు అయినా చేసే ఓపికా లేకుండా కాలక్షేపం చేస్తున్నపుడు మహారాజావారు ఇంత ప్రసిద్ధులెలా అయ్యారు? ఆదర్శ ప్రభువుగా బ్రిటిష్ వారిచే ఎలా మెప్పుకోలు పొందారా? అని.

అదొక బ్రహ్మరహస్యమేమీ కాదు. కేవలం బ్రిటిష్ వారి రహస్యం.

భోగాల్లో మునిగితేలే మహారాజావారికి రాచ వ్యవహారాలేమీ పట్టవు కనుక బ్రిటిష్‌వారు తమకు ఇష్టులైన ముఖ్యమంత్రుల్ని నియమింపజేసి ఇష్టారాజ్యాన్ని చెలాయించేవారు.

అందుకే మహారాజావారు ఆదర్శ పాలకులుగా దేశ విదేశాల్లో లబ్ధ ప్రతిష్ఠులయ్యారు.

★